

వికారాబాద్ పట్టణంలో కామదహనం

రంగు పడుద్ది

రంగుల పండుగ హోలీని ఘనంగా జరుపుకునేందుకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. నేడు(శుక్రవారం) ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా జరిగే హోలీ సందర్భంగా గురువారమే జిల్లాలో సందడి మొదలైంది. మార్కెట్లలో రంగులతో పాటు, చల్లుకునే గన్స్ తదితర వస్తువుల దుకాణాలు కిటకిటలాడాయి. యువకులు, మహిళలు, పిల్లలు ఆనందోత్సాహాలతో వేడుకను జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం రాత్రి జిల్లాలోని వివిధ కూడళ్లలో కామ దహనాలు నిర్వహించారు. హోలీ వేడుకల్లో రసాయనాలతో తయారు చేసినవి కాకుండా సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

-మేడ్చల్ ప్రతినిధి/వికారాబాద్ మార్చి 13(ఆంధ్రజ్యోతి)





మేడ్చల్‌లో రంగుల విక్రయాలు



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మెరుగైన వైద్యం అందించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పూడూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌సూచించారు. ఆయన గురువారం అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్, లేబొరేటరీ, మందుల నిల్వ గదితో పాటు ఏఎంసీ తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆస్పత్రి భవనం పరిసరాలను కలెక్టర్ పరిశీలించి మరమ్మతు పనులను త్వరగా చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన లైట్లు, ఫ్యాన్లు వెంటనే సమకూర్చాలన్నారు. అదేవిధంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట తహసీల్దార్ భరత్‌గౌడ్, డాక్టర్ దేవికారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీబీ శీతల్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

» జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ డీబీ శీతల్

వికారాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ డీబీ శీతల్ సూచించారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని అనంతపద్మనాభ డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమన్నారు. కుటుంబ వ్యవస్థలో ప్రేమాభిమానాలు కీలకమని, వివాదాలు తలెత్తినప్పుడు నిర్వహణ హక్కులు, పోలీసులకు దరఖాస్తులు ఎలా ఇవ్వాలో తెలుసుకోవడం అవసరమని న్యాయవాదులు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాము, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, ప్యానల్ న్యాయవాది రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్, బోధన సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త సార్లొచ్చారు!

కొలువుదీరిన జూనియర్ లెక్చరర్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనా కష్టాలు తీరనున్నాయి. గురువారం కొత్త లెక్చరర్లు కొలువుదీరారు. 13 ఏళ్లుగా జూనియర్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో అధ్యాపకులు లేక ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు టీజీపీఎస్సీ నియామక పరీక్ష నిర్వహించగా, ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. అంతకు ముందే వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులు కళాశాలలను ఎంచుకున్నారు. కాగా, జిల్లాలో 56 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండగా, 42 మందికి పోస్టింగులు ఇచ్చారు.

56 పోస్టులు ఖాళీగా ఉండగా.. 42 భర్తీ

అత్యధికంగా వికారాబాద్ కాలేజీకి 8 మంది కేటాయింపు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తీరనున్న లెక్చరర్ల కొరత

ఈ ఏడాది కాలేజీల్లో పెరగనున్న విద్యార్థుల సంఖ్య





కొడంగల్ కళాశాలలో రిపోర్టు చేస్తున్న అధ్యాపకుడు

వికారాబాద్, మార్చి13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వికారాబాద్, నవాబ్‌పేట్, దోమ, మర్పల్లి, మోమిన్‌పేట్, తాండూరు, పెద్దేముల్, పరిగి, కొడంగల్‌ల్లో ఇది వరకే జూనియర్ కళాశాలలు ఉండగా, గత రెండేళ్లలో దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, బషీరాబాద్, హకీంపేట్‌లలో కళాశాలలు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 9 మంది ప్రిన్సిపాళ్లు పనిచేస్తున్నారు. 103 మంది జూనియర్ లెక్చరర్ల(జనరల్)కు 68 మంది రెగ్యులర్, ఒకరు ఎంటీఎస్ అధ్యాపకుడు పని చేస్తున్నారు. ఉర్దూ మీడియంలో 25 జూనియర్ లెక్చరర్ పోస్టులకు అన్ని ఖాళీగానే ఉన్నాయి. ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ పోస్టులు 13 ఉండగా, వాటిలో నలుగురు రెగ్యులర్, ఇద్దరు ఎంటీఎస్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 5 మంజూరు కాగా, అవీ ఖాళీగానే ఉన్నాయి. 5 లైబ్రేరియన్ పోస్టుల్లో నలుగురు విధులు నిర్వహిస్తున్నారు. కొత్తగా అధ్యాపకుల నియామకం చేపట్టడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల కంటే ఇంకా ఎక్కువ సంఖ్యలో చేరడానికి ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 56 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండగా, 42 మందికి పోస్టింగులు ఇచ్చారు. అత్యధికంగా వికారాబాద్ కళాశాలకు 8 మందికి పోస్టింగ్ ఇచ్చారు. కాగా, హకీంపేట్‌కు కేటాయించిన హిందీ అధ్యాపకురాలికి వికారాబాద్‌లో, మర్పల్లికి కేటాయించిన మ్యాథ్స్ అధ్యాపకుడికి బషీరాబాద్‌లో అదనపు

మిగతా 8వ పేజీలో...

కాలేజీల వారీగా పోస్టింగులు

వికారాబాద్	08
దోమ	03
హకీంపేట్	03
కొడండల్	05
మర్పల్లి	03
మోమిన్‌పేట్	02
నవాబ్‌పేట్	02
పరిగి	04
పెద్దేముల్	07
తాండూరు	05

సబ్జెక్టుల వారీగా..

జువాలజీ	04
ఎకనామిక్స్	04
కెమిస్ట్రీ	02
మ్యాథ్స్	05
ఫిజిక్స్	04
బాటనీ	04
హిస్టరీ	02
కామర్స్	02
భాషా సబ్జెక్టుల్లో	
ఇంగ్లిష్	04
హిందీ	03
ఉర్దూ	03
తెలుగు	01
ఉర్దూ మీడియం	04

జిల్లాలో నేడు..

'డయల్ యువర్ డీఎం'

వికారాబాద్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్టీసీ బస్ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి నేడు(శుక్రవారం) ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ అరుణ తెలిపారు. సలహాలు, సూచనలు ఇవ్వడానికి 9959226252 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

తాండూరులో ఉదయం 10 గంటలకు

తాండూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తాండూరు ఆర్టీసీ డిపో పరిధికి సంబంధించి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సమస్యలపై సెల్ నంబర్ 9959226251కు ఫోన్ చేయాలని కోరారు.

కాగ్నా గంగా హారతి



తాండూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పౌర్ణమికి జరిగే కాగ్నా నది గంగా హారతి కార్యక్రమాన్ని నేడు(14న) సాయంత్రం 5:30 గంటలకు కోకట్ గ్రామ సమీపంలోని వంతెన పక్కన నిర్వహిస్తున్నట్లు తాండూరు ధర్మ జాగారణ సమితి ప్రతినిధులు తెలిపారు. బ్రాహ్మణ అర్చక, పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గంగా పూజ, గంగా దీపోత్సవం, గంగా హారతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందువులందరూ ఈ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు.

ఊపందుకున్న సర్వే

వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ సర్వే పనులు వేగవంతం



మూడు విధాలుగా కొనసాగుతున్న పనులు

రైల్వేలైన్‌తో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం

పనుల వేగవంతానికి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు

కొడంగల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ సర్వే పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే పలుమార్లు సర్వే నిర్వహించి సమీక్షలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో మరోసారి సర్వే కొనసాగిస్తున్నారు. పరిగి, కొడంగల్, నారాయణపేట, మక్తల్ మీదుగా కృష్ణా వరకు రైల్వేలైన్ సర్వే కొనసాగుతుంది. వికారాబాద్ నుంచి

మిగతా 8వ పేజీలో...



రైల్వేలైన్ సర్వే పనుల్లో సిబ్బంది

మూడు జిల్లాలకు ఉపయోగం

వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ మూడు జిల్లాలను కలుపుతూ వెళ్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో రైలు సౌకర్యం లేక తాండూర్, మహబూబ్‌నగర్, వికారాబాద్, యాద్గీర్ తదితర స్టేషన్లకు వెళ్లడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైల్వే లైన్ ఏర్పాటుతో వికారాబాద్, నారాయణపేట్, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని కొడంగల్, మద్దూర్, పరిగి, మక్తల్, నారాయణపేట తదితర ప్రాంతాల ప్రజలకు మేలు జరగనుంది. ఇటీవలే దౌల్తాబాద్, కొడంగల్, తుంకిమెట్ల, పరిగి మీదుగా సర్వే పనులు చేపట్టడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం

రేపటి నుంచి ఒంటిపూట బడులు

వికారాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేపటి(15వ తేదీ) నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. శనివారం నుంచి విద్యా సంవత్సరం ముగిసే వరకు ఆఫ్ డే స్కూల్స్ కొనసాగనున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పదో తరగతి పరీక్షలు కొనసాగే స్కూళ్లలో ఒంటి గంట నుంచి 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి.


16న మెగా జాబ్‌మేళా

తాండూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో 16న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఫాక్స్‌కాన్ వారి సౌజన్యంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9739693954, 8688547057, 9100491109 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మళ్లీ పెద్దచెరువు తూము ఎత్తివేత

కాల్వల ద్వారా వృథాగా పోతున్న నీరు

ఆందోళనలో మేడ్చల్ ప్రజలు



తూము నుంచి వృథాగా ప్రవహిస్తున్న నీరు

మేడ్చల్ టౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పెద్ద చెరువు నీటిని ఖాళీ చేయడానికి గుర్తు తెలియని వ్యక్తులు మరోసారి పూనుకున్నారు. చెరువు కట్ట తూములను ఎత్తేసి నీరు బయటికి వదిలారు. ఫలితంగా చెరువు నుంచి బయటికి వస్తున్న వరద కట్ట కింద ప్రాంతాల మీదుగా జాతీయ రహదారి వరకు చేరుకుంది. పెద్ద చెరువు నీటిని ఖాళీ చేయడాకి నిత్యం కుట్రలు జరగుతున్నాయని స్థానిక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల వృథాగా నీరు పారుతున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై స్పందించిన అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని హెచ్చరికలు జారీ చేశారు. అయినా మళ్లీ యథావిధిగా నీళ్లను బయటకు వదులుతున్నారు. ఆ చెరువు ఎండితే మేడ్చల్‌తో పాటు కిష్టాపూర్, పూడూరు, మునీరాబాద్, తదితర 8 గ్రామాల్లో బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంది.

తూముల వద్ద భద్రత ఏర్పాటు..

చెరువు తూముల వద్ద భద్ర ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. రికార్డుల ప్రకారం చెరువులో శిఖం కన్న పట్టా భూములు అధికంగా ఉన్నాయి. దీంతో కొందరు భూయజమానులు రియల్టర్లతో చేతులు కలిపి నీరుఖాళీ చేసే కుట్ర పన్నుతున్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద చెరువుకు ఆనుకుని ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ స్థలాల్లో పెద్ద పెద్ద వెంచర్లు, విల్లాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

చిన్నబోయిన పెద్ద చెరువు

కొండాపూర్ చెరువులో తగ్గిన నీటి నిల్వ 7

'రేషన్' మంజూరులో గందరగోళం

కొడంగల్‌లో కులకచర్ల వాసుల పేర్లు నమోదు 8

చోరీకి వచ్చి.. వ్యక్తిని చంపి

● షాబాద్‌లో ఘటన

షాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):మద్యం దుకాణంలో చోరీకి వచ్చిన దుండగుడు ఓ వ్యక్తిని హత్య చేశాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌లోని శ్రీదుర్గా వైన్‌షాప్ పక్కన కూల్ పాయింట్‌లో షాబాద్ గ్రామానికి చెందిన చేగూరి భిక్షపతి అలియాస్ ప్రవీణ్(35) పనిచేస్తున్నాడు. రాత్రి మాదిరిగానే వైన్‌షాప్ పర్మిట్ రూంలో పడుకున్నాడు. ఓ దొంగ వైన్‌షాప్‌లోకి చోరీకి వచ్చాడు. వైన్‌షాప్ వెనక గోడ కు రంధ్రం చేశా డు. క్యాష్‌కౌంటర్‌లోని రూ.40వేల నగదు, లిక్కర్ బాటిళ్లు, సీసీ కెమె రా డివైజ్‌ను ఎత్తుకెళ్తుండగా భిక్షపతి అడ్డుకున్నాడు. దీంతో దుండగుడు ఇనుప రాడ్డుతో అతడి తలపై కొట్టాడు. దీంతో భిక్షపతి అక్కడికక్కడే మృతిచెందాడు. చేవెళ్ల ఏసీపీ కిషన్, క్రైమ్ ఏసీపీ శంషాంక్‌రెడ్డి, సీసీఎస్, ఎస్వోటీ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, రమణారెడ్డి, డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం సభ్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వైన్ షాపునకు దుండగుడు వేసిన కన్నం


భిక్షపతి(ఫైల్)

లోక్‌సత్తా కృష్ణారావు అస్తమయం



కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకులు జె.కృష్ణారావు(88) అనారోగ్యంతో మరణించారు. రాజన్న-సిరిసిల్ల జిల్లా దుర్రవరానికి చెందిన జె.కృష్ణారావు లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషిచేశారు. కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లో నివాసం ఉండే కృష్ణారావు గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ గురువారం తెల్లవారు జామున తుదిశ్వా స విడిచారు. కుటుంబీకులు వెంకటరావునగర్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎండల్లో చల్లకుండ

● ఊపందుకోనున్న కుండల అమ్మకాలు

● వేసవి కాలంలో కుండ నీటిని తాగేందుకు జనం మొగ్గు

● మట్టి పాత్రలకు పెరుగుతున్న ఆదరణ


హిమాయత్‌నగర్‌లో అమ్ముతున్న కూజలు, కుండలు, ఇతర పాత్రలు

మొయినాబాద్ రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటికి కుండలు, కూజలు ఇతర మట్టి పాత్రల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎండలు ముదురుతుండడంతో మట్టిపాత్రల అమ్మకాలు మొదలయ్యాయి. పేదోడి ఫ్రిడ్జిగా పిలవబడే కుండ నీటిని తాగేందుకు జనం ఇష్టపడుతున్నారు. ఎండ నుంచి ఇంటికి చేరి దాహం తీర్చుకునేందుకు కుండ నీటిని తాగుతున్నారు. ఇళ్లలో ఫ్రిడ్జ్ ఉన్నా కుండలు కొంటున్నారు. మార్కెట్‌లో చిన్నకుండ రూ.90, పెద్దవి రూ.200 నుంచి 400 వరకు అమ్ముతున్నారు.

మట్టి వంట పాత్రలపై మక్కువ

గతంలో తాగునీటి కోసమే కుండలను కొనేవారు. నేడు కూరలు వండుకునేందుకు కూడా మట్టి పాత్రలను కొంటున్నారు. మట్టి పాత్రల్లో వండితే వంటకాలు రుచిగా ఉంటాయని ప్రజలు నమ్ముతున్నారు. పెరుగు తోడుకూ మట్టి పాత్రలను ఎక్కువ మంది వాడుతున్నారు. మొయినాబాద్, హిమాయత్ నగర్, చిల్కూరు, అజీజ్‌నగర్, ఎన్కేపల్లి గ్రామాలతో పాటు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై కుండలు, కూజలు, ఇతర మట్టి ప్రాతల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని అమ్ముతున్నది మాత్రం ఎక్కువ మంది హిమాయత్‌నగర్ గ్రామ కుమ్మరులే!

గతేడాది కంటే గిరాకీ తగ్గింది



వేసవి రాగానే చాలా మంది తాగునీటిని నింపుకునేందుకు కుండలు కొంటారు. ఈ మధ్య మట్టి వంట పాత్రలు కావాలనీ అడుగుతున్నారు. వివిధ మట్టిపాత్రలకు గిరాకీ ఉంది కానీ ఆశించిన మేర లాభం రావాడం లేదు. మేం 2లక్షలు పెట్టి వ్యాపారం ప్రారంభించాను. కులవృత్తిని నమ్ముకున్నాను.

- కుమ్మరి శివ, హిమాయత్‌నగర్

కుండలు అమ్ముతున్న ప్రాంతాలివే...

కుండలతో పాటు మట్టి వంటకాల పాత్రల విక్రయానికి ప్రధాన వేదిక మండల పరిధిలోని హిమయత్‌నగర్ గ్రామం. ఈ గ్రామానికి చెందిన కుమ్మరి కులస్థులే వివిధ ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నారు. హిమయత్‌నగర్‌తో పాటు మొయినాబాద్ మండల కేంద్రం, అజీజ్‌నగర్, చిలుకూరు బాలాజీ ఆలయానికి వెళ్లే దారిలో కుండలు, మట్టి పాత్రల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

మట్టి పాత్రల్లో వంట శ్రేష్ఠం



పాత కాలంలో స్టీల్‌పాత్రలు, రైస్ కుక్కర్లు లేనప్పుడు మట్టి వంటపాత్రల్లోనే వండేవారు. అందులో వండిన అన్నం, కూర తింటే రుచిగా ఉండేవి. రాన్రాను మట్టి పాత్రల వినియోగాన్ని తగ్గించారు. మట్టి పాత్రలు కొనేవారు లేక వాటి తయారీనీ మానేశారు. ప్రస్తుతం కొత్తకొత్త వ్యాధులొస్తుండడంతో మళ్లీ మట్టి వంట పాత్రలపై మక్కువ చూపుతున్నారు. కుండ నీరు తాగేందుకు ఇష్టపడుతున్నారు. మట్టిపాత్రల్లో వండిన ఆహారం, కుండలోని నీరు ఆరోగ్యకరం అని భావిస్తున్నారు.


- చదువు రాంచందర్, చిలుకూరు గ్రామం

బీసీలు రాజ్యాధికారం సాధించాలి


నియామక పత్రం అందుకుంటున్న పురుషోత్తంగౌడ్

కేశంపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జనాభాలో సింహభాగం ఉన్న ఉన్న బీసీలు ఐక్యం ఉండి రాజ్యాధికారం సాధించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పిలుపునిచ్చారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకులలో గురువారం బీసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బలహీన వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. రాజకీయంతోనే అధికారం సాధించొచ్చన్నారు. చదువుకోని యువకులను రాజకీయం వైపు ప్రోత్సహించాలని సూచించారు. అల్పసంఖ్యాక వర్గలు రాజ్యాధికారం సాధించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది బీసీ నాయకులను గెలిపించాలని కోరారు. అనంతరం మండల బీసీ సేన అధ్యక్షుడిగా తొమ్మిది రేకులకు చెందిన పురుషోత్తంగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆయనకు నియామకపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప, ప్రధాన కార్యదర్శి భూషం నరేష్, నియోజకవర్గ లేడీ వింగ్ అధ్యక్షురాలు వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సౌజన్య, నా యకులు మమత, భాగ్యలక్ష్మీ, శివ, చం ద్రశేఖర్, వెంకటేష్, రవి, వరప్రసాద్, యాదయ్య, రవిగౌడ్, శ్రీనివాసులు, సురే ందర్‌గౌడ్, సుధాకర్, పాండు పాల్గొన్నారు.

హోలీని సహజ రంగులతో జరుపుకోవాలి



వికారాబాద్, మార్చి13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ జిల్లా, రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను వయస్సుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దలు కలిసి జరుపుకునే రంగుల పండుగ అని స్పీకర్ పేర్కొన్నారు. స్నేహభావాన్ని పెంపొందించే ఈ పండుగను ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సహజ రంగులతో జరుపుకోవాలని సూచించారు. సంబరాల్లో అప్రమత్తంగా ఉండాలని, స్నేహితులు, కుటుంబసభ్యులతో సురక్షితంగా హోలీ జరుపుకోవాలని స్పీకర్ ఆకాంక్షించారు.

గ్రూపు-2లో రాకేశ్‌కు స్టేట్ 177వ ర్యాంక్



ఆదిభట్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తల్లి దినసరి కూలీ. తండ్రి లేడు. ఉండేందుకు సరైన ఇల్లు లేదు. చదివింది ప్రభుత్వ పాఠశాలే. బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది అతడి లక్ష్యం. చివరికి లక్ష్యాన్ని సాధించాడా యువకుడు. ఇబ్రహీంపట్నం మండలం పొల్కంపల్లికి చెందిన గుండ్ల జయమ్మ-వెంకటేష్‌ల కొడుకు రాకేష్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో స్టేట్ 177వ ర్యాంక్, బీసీ-బి కేటగిరిలో 8వ ర్యాంక్ సాధించి ఆదర్శంగా నిలిచాడు. రాకేష్ పొల్కంపల్లిలోని పాఠశాలలో 1 నుంచి పదో తరగతి వరకు చదివాడు. ఉన్నత విద్య హైదరాబాద్‌లోని ప్రైవేట్ కాలేజీల్లో అభ్యసించాడు. అతడు 2019 నుంచి వివిధ పోటీ పరీక్షలకు ఇంటి వద్దే ఉండి సిద్ధమయ్యాడు. 2024లో గ్రూప్-4 పరీక్షలో హెచ్ఎండీఏలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ఆ జాబ్ చేస్తూనే గ్రూప్-1, 2 ఉద్యోగాలకు అప్లై చేశాడు. ఒక వైపు ఉద్యోగం మరో వైపు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. ప్రభుత్వం డిసెంబరులో నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష రాసి 177వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-2లో ర్యాంకు సాధించిన రాకేష్‌కు అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ లేదా ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్సైగా ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కర్రెడ్ల నరేందర్ రెడ్డి

కేశంపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు చాలా కాలంగా వేతనాలందక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగ కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేశంపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకున్నా పారిశుధ్య కార్మికులు రోజూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. గ్రామ పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులకు ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో పనులు చేసే కార్మికులకు నెలనెలా మొదటి వారంలోనే వేతనాలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు కల్వకోలు తిరుపతి, అనెమోని కృష్ణ పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు అందించాలి


నిరసన తెలుపుతున్న రైతులు, సీపీఐ నాయకులు

మోమిన్‌పేట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కేసారం గ్రామంలో 55మంది దళితులు ఉన్నారని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. 70ఏళ్లుగా ప్రభుత్వ, ఫారెస్టు భూములు 220ఎకరాల్లో 55 కుటుంబాలు సాగుచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. పొలాలకు దారులుబంద్ చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు ప్రభుత్వం పట్టాలివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆనందం, ప్రభాకర్, మానెయ్య, మొగులయ్య, కిష్టయ్య, నర్సిములు, సుకుమార్, ప్రకాశ్, రాములు, శాంతయ్య, చంద్రయ్య, సంగమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


షాద్‌నగర్ చౌరస్తాలో జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మతో కాంగ్రెస్ నాయకుల ఆందోళన

షాద్‌నగర్ అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఏకవచనంతో సంబోధించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. షాద్‌నగర్ చౌరస్తాలో గురువారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జగదీశ్వర్‌రెడ్డికి, బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ షాద్‌నగర్ తాలూకా అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు మొదటి నుంచీ దళితులంటే చిన్నచూపే అన్నారు. స్పీకర్‌ను అవమానిస్తూ మాట్లాడిన ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకులు ఎస్.అనిల్‌కుమార్, నాగి సాయిలు, జాంగారి రవి, నర్సింహులు, జంగయ్య, మహిపాల్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయించండి


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ దశరథ్

హైదరాబాద్ సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ డివిజన్లలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయించాలని రంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అదేశించారు. నాంపల్లిలోని ఎక్సైజ్ భవన్‌లో గురువారం రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శంషాబాద్, సూరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ల పరిధిలో టార్గెట్లు పూర్తిచేస్తూ మద్యం అమ్మకాలకు ఇబ్బంది కలిగించే డ్రగ్స్, నాన్ డ్యూటీపెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలని సూచించారు. ఐదు ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో పలు కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్ డిస్పోజల్‌కు అనుమతులు తీసుకొని ప్రభుత్వ అమోదిత కేంద్రాల్లో కాల్చివేయాలన్నారు. పట్టుబడిన వాహనాలను వేలం వేయించడానికి చర్యలు తీసుకోవాలని అదేశించారు. సమావేశంలతో రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ మేళా

తలకొండపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మెదక్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు వివిధాంశాలపై ప్రదర్శనలిస్తూ తోటి విద్యార్థులు, సందర్శకులు, తల్లిదండ్రులకు వివరించారు. హెచ్ఎం సంతోషకుమార్ మేళాను ప్రారంభించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ఎగ్జిబిట్లు ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. వివిధ పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు, గ్రామస్తులు రమాదేవి, విష్ణుగౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సైన్స్ మేళాలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

17 నుంచి ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ శిక్షణ తరగతులు

వికారాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో మూడు రోజుల పాటు ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లింగంనాయక్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17, 18, 19 తేదీల్లో జాతీయ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ శిబిరానికి పలువురు మేధావులు వచ్చి తరగతులు నిర్వహించి దిశానిర్దేశం చేస్తారన్నారు. వచ్చిన కార్యకర్తలకు వసతి ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయాలి

శంకర్‌పల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సహాయం చేయడం తమ అదృష్టమని ఆల్ ఇండియా లైనస్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ భాగ్యనగర్ టీఎస్-1 సంవర్దన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జ్యోతి అన్నారు. సంవర్దన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పల్లెరుచులు రెస్టారెంట్‌లో మున్సిపల్ కార్మికులకు చీరలు, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. పేదలకు సహాయం చేయడమే తమ క్లబ్ ధ్యేయం అన్నారు. ఇందుకు ప్రతొక్కరూ సహకరించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి లైనస్ సరళ రాజ్యలక్ష్మి. సభ్యులు గీత, అఖిల, జీవిత తదితరులు ఉన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

యాచారం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రతీ పంచాయతీలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని, ఇందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత సూచించారు. గురువారం మండల పరిషత్‌లో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. పన్నుల వసూళ్లపై శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి ఇంటి నుంచి వృత్తి, ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థ 18 నుంచి 35ఏళ్ల మధ్య మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి రోజూ 300 స్టైఫండ్ ఇస్తారని, దీనిపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వారం వారం మొక్కలకు నీరుపెట్టాలన్నారు. డ్రెయిన్లలో రోజూ పూడిక తీయించాలన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఏపీవో లింగయ్య తదితరులు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న ఎల్‌ఆర్ఎ్‌సను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ సూచించారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ కింద ఫీజు చెల్లించిన వ్యక్తికి ప్రొసీడింగ్‌ను అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 31లోపు ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ వస్తుందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాంచందర్‌రావు, సీనియర్ అసిస్టెంట్‌రాజు పాల్గొన్నారు.

విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి

మహేశ్వరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్ నాయక్ అన్నారు. గురువారం ఉపతహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి నిధుల కేటాయింపుతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దందాపై ప్రభుత్వం దృష్టి సారించి కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సయూద్, సాయి, కార్తీక్ పాల్గొన్నారు.

విలీన పంచాయతీల సిబ్బందికి జీతాలివ్వాలి

ఘట్‌కేసర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనమైన పంచాయతీల కార్మికులకు రెండు నెలలుగా జీతాలివ్వక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పోచారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకుడు యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం పట్టణం, నగర సమీప పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేసి వారి జీతాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. వారు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా కమిషనర్ సిబ్బందికి జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ, బిక్షపతి, జంగయ్య, కృష్ణ, కనకరాజు, లింగం జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఈఆర్‌సీలో ఫిర్యాదు చేయండి

పరిగి,మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై ఈ నెల 21న జరిగే ఈఆర్‌సీలో ఫిర్యాదు చేయాలని బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్ గురువారం తెలిపారు. 21న నగరంలోని వెంగళరావునగర్‌లోని ఈఆర్‌సీ భవన్‌లో వినియోగదారుల సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహిస్తారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టినా ఏర్పాటు చేయకపోవడం, కొత్త స్తంభాల ఏర్పాటు, వైర్లు ఇవ్వకపోడం తదితర సమస్యలపై విద్యుత్ వినియోగదారులు ఈఆర్‌సీకి ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. విద్యుత్‌షాక్‌తో ఎవరైనా చనిపోతే రూ.5లక్షలు, పశువులు చనిపోతే ఒక్కో దానికి రూ.40వేలు ఇవ్వాలనే నిబంధన ఉందన్నారు. వీటిపై అవగాహన లేక గ్రామీణులు నష్టపోతున్నారని తెలిపారు. రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు విద్యుత్ సమస్యపై ఈఆర్సీలో సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

కులకచర్ల ఏఎంసీని ఆదర్శంగా మారుస్తాం

కులకచర్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మార్కెట్ కమిటీని ఆదర్శంగా మారుస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు తెలిపారు. గురువారం ఏఎంసీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం వ్యాపారులు మార్కెట్ నుంచి లైసెన్స్ తప్పక పొందాలన్నారు. మార్కెట్‌కు త్వరలోనే షెడ్‌లోకి మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మొగులయ్య, వైస్‌చైర్మన్ రామ్మోహన్‌శర్మ, కార్యదర్శి విజయ్‌కిషోర్, డైరెక్టర్లు భరత్‌కుమార్‌రెడ్డి, రాంచందర్, బుగ్గమ్మ, నీల్యానాయక్, సిబ్బంది రాములు, సిద్ధూ పాల్గొన్నారు.



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

భవిష్యత్తు తరాలకు వెలుగునిచ్చేది విద్య

పూడూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు వెలుగునిచ్చేది విద్య మాత్రమే అని కడుమూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధు అన్నారు. గురువారం పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తోటి విద్యార్థులకు బోధించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. స్వయం పాలనలో బిందు, ఆకాంక్ష, మనోహర్, ఫర్హాన్, పృథ్వీ, అవంతిక, వీణామాధురి, సంజీవ్, దీక్షిత్, హర్షవర్ధన్, అర్చన్, రిత్వికలు బాధ్యతలు నిర్వర్తించారు. కార్యక్రమంలో టీచర్లు శ్రీకాంత్, విఠల్, అనూష, హరీష్, బాబు, అనిల్, సువానయ్య, తల్లిదండ్రులు మల్లేష్, యాదయ్య, తిరుమలేష్, కుమారస్వామి, కావేరి, రమేష్ పాల్గొన్నారు.

ముదురుతున్న ఎండలు.. నిర్మానుష్యంగా రోడ్లు

తాండూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చేసింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం పదకొండు దాటిందంటే రోడ్ల మీది జనం పలచనైతున్నారు. గురువారం తాండూరులో 37డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం కూడా ఎండ తీవ్రంగానే ఉంది. తాండూరు ప్రాంతంలో గ్రానైట్ గనులు విస్తరించడంతో ఇతర ప్రాంతాల కంటే ఇక్కడ ఎండ తీవ్రత ఎక్కువ. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు ప్రజలు బయటికి రావడం లేదు. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తోపుడుబండ్ల, వీధి వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకా ఒంటిపూట బడులు ప్రకటించకపోవడంతో ఎండ వేడితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లలో కూలర్లు, ఏసీలు పెట్టుకుంటున్నారు.

మేడ్చల్ జోన్‌లో విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేస్తాం

హైదరాబాద్ సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జోన్‌లో విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ అన్నారు. హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్లలో చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను గురువారం సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన పీటీఆర్, ఫీడర్లను వినియోగదారులతో ప్రారంభింపజేశారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. మేడ్చల్ జోన్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను అంచనా వేసి అందుకుతగ్గ పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. గత వేసవిలో మేడ్చల్, బౌరంపేట్, అమీన్‌పూర్, బాచుపల్లి, ప్రగతినగర్, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, మియాపూర్, పటాన్‌చెరు, మయూరినగర్ ప్రాంతాల్లో సమస్యలెదురయ్యాయని, వాటిని సాంకేతిక సర్వే చేసి భారీ స్థాయిలో పనులు చేశామన్నారు. ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లలో అదనంగా 62పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, 1,081పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను, వాటికి 243/11కేవీ ఫీడర్లను, 37/33కేవీ ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు. మేడ్చల్ జోన్ పరిధిలో 15 నూతన 33/11కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కమర్షియల్ డైరెక్టర్ సాయిబాబు, మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజినీర్ కామేశ్, ఎస్ఈలు బ్రహ్మం, రవికుమార్, శ్రీనాథ్, డీఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నూతన సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న వినియోగదారులు, అధికారులు

చిన్నబోయిన పెద్ద చెరువు

భారీగా తగ్గిపోయిన కొండాపూర్ చెరువు నీటి నిల్వలు

- ఆయకట్టు కింద 90 ఎకరాల్లో వరి సాగు
- మరో రెండు రోజులే పారకానికి అందుబాటులో నీరు
- కోట్‌పల్లి ప్రాజెక్టు నీటితో చెరువును నింపాలని వేడుకుంటున్న రైతులు



నీటిమట్టం పడిపోతున్న పెద్దచెరువు

పెద్దేముల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని పెద్దచెరువు ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చెరువుకింద సాగుచేస్తున్న 90ఎకరాల వరి చేనుకు నీరందక ఎండే పరిస్థితి తయారైంది. మరో 40రోజులకు పైగా పంటలకు నీరు కావాలి. అంత వరకూ చెరున నీటిని అందించే పరిస్థితి కన్పించడం లేదు. పంట చేతికొస్తుందో? లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొండాపూర్ పెద్దచెరువు వానకాలంలో నిండుకుండలా మారగా రైతులు మురిసిపోయారు. యాసంగి కూడా సాగుచేసుకోవచ్చని సంతోషించారు. వానకాలం పంటలు పూర్తయ్యే నాటికి చెరువులో సగానికిపైగా నీరుండడంతో యాసంగిలో అందరూ వరినే సాగుచేసుకున్నారు. వరి నాటిన రెండు నెలలకే చెరువులో నీరు దాదాపు 80శాతానికిపైగా ఖాళీ అయ్యింది. పంట గట్టెక్కుతుందా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద బోర్లు కూడా లేవు. కొన్ని రోజుల క్రితం ఆయకట్టు రైతులు కలెక్టర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిని చెరువులోకి వదిలాలని కోరారు. స్పందించిన కలెక్టర్ కొండాపూర్ చెరువుకు నీరు వదలాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రాజెక్టు నీటిని వదిలినా అవి చెరువుకు చేరలేదు. కాలువలు సక్రంగా లేక, కెనాల్‌కు గండ్లు ఏర్పడడంతో చెరువుకు నీరు చేరడం లేదు. రైతులు రెండుమూడు రోజులు కాలువవెంట తిరిగినా ఫలితం లేకుండా పోతోంది. కాలువకు పడ్డ పెద్ద గండ్లను యంత్రాలతో పూడ్చితే తప్ప చెరువుకు నీరు రాదని రైతులు చెబుతున్నారు. పంటలెండకముందే కాలువ గండ్లు పూడ్చాలని, నీటి వృథాను అరికట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటలు చేతికి రాకుంటే అప్పులపాలవుతామని వాపోతున్నారు. అధికారులు నీటిని వదిలి ఆయకట్టుకిందున్న 50మంది రైతుల పంటలను కాపాడాలని అన్నదాతలు కోరుతున్నారు.



చెరువుకింద సాగవుతున్న వరి చేను

ఐదెకరాలు కౌలుకు వేసుకున్నా



నాకు సొంత జాగ లేదు. చెరువుకింద రైతుల నుంచి ఐదెకరాలు కౌలుకు తీసుకొని పంట వేశాను. ఎకరాకు రూ.10వేల చొప్పున కౌలు చెల్లించాను. అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. ఈ భూమికి బోరు లేదు. చెరువులో నీరు ఖాళీ అవడంతో పంట పండుతుందా? ఎండుతుందా? అని భయమైతోంది. కాలువలకు పడ్డ గండ్లు పూడ్చడం మా వల్ల అయితలేదు. అధికారులు మిషన్లతో కాలువల గండ్లు పూడ్చి చెరువులోకి నీరొచ్చేలా చర్యలు తీసుకోవాలి. చెరువులోకి నీరు రాకుంటే పంట ఎండుతుంది.

- పాండునాయక్, కౌలు రైతు, మదనంతాపూర్

అధికారులు చెరువు నింపి ఆదుకోవాలి



చెరువులో బాగా నీరుందనే వరి సాగు చేశాను. 3 ఎకరాల్లో పంటవేశాను. ఇంత త్వరగా నీళ్లు అయిపోతాయనుకోలేదు. వరి నాటిన రెండు నెలలకే నీళ్లు ఖాళీ అయ్యాయి. అధికారులు చెరువులోకి నీళ్లు వదిలి మమ్మల్ని ఆదుకోవాలి.

- రూప్‌సింగ్, రైతు, నెల్లిగడ్డతండా

చెరువు నీరుతో మరో రెండు రోజులే పారుతుంది



కొండాపూర్ పెద్ద చెరువు కింద నాకు అర ఎకరం వరి పొలం ఉంది. వరి వేశారు. చెరువులో నీళ్లు ఖాళీ అయ్యాయి. ప్రస్తుత నీటి నిల్వలు మరో రెండురోజులే పారుతుంది. ఆ తరువాత నీళ్లు లేక పంట ఎండుతుంది. చెరువుకింద 50మంది రైతులు 90 ఎకరాల పంట వేశారు. అందరూ చిన్నకారు రైతులమే. పంట చేతికిరాకుంటే తినేందుకు కూడా మెతుకులు కరువే! అధికారులు ప్రాజెక్టు నీటిని వదిలి మమ్మల్ని ఆదుకోవాలి.

- లాజర్, రైతు, కొండాపూర్

19లోగా బూత్ ఏజెంట్ల నియామకం

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి 19వ తేదీలోగా పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకానికి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి ఆయనతో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఫారం 6, 7, 8 పెండింగ్ దరఖాస్తులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పై అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేహమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ డెలివరీ చేయని వారిపై చర్యలు

వికారాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ చేయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల అధికారుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖరీఫ్ 2024-25 సీజన్‌లో పాల్గొన్న మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వని మిల్లర్లకు తదుపరి సీజన్‌లో ధాన్యం కేటాయింపు జరగదని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, డీఎం వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా పౌర సరఫరాల అధికారి జిల్లా మేనేజర్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే లక్ష్యాలను చేరుకుంటాం

సినీ నటుడు విజయ్ దేవరకొండ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితేనే ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుంటామని ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో గురువారం రాత్రి జరిగిన సినర్జీ-2కే25 వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ్ మాట్లాడుతూ.. మనకు మంచి భవిష్యత్తు ఉందని.. దానిని అనుభవించాలంటే మనం బతికి ఉండాలని, నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడపొద్దని విద్యార్థులకు సూచించారు. లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలని కోరారు. ఉన్నత స్థాయికి చేరి సమాజానికి సేవచేయాలన్నారు. అనురాగ్ యూనివర్సిటీకి తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని తెలిపారు. ఫ్యాన్స్ లేనప్పుడు విద్యార్థులే నాకు అండగా నిలిచారని తెలిపారు. తాను నిత్య విద్యార్థినన్నారు. అనంతరం యూనివర్సిటీ సీఈవో నీలిమ, రిజిస్ట్రార్ అర్చన తదితరులు విజయ్ దేవరకొండను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.



మాట్లాడుతున్న నటుడు విజయ్ దేవరకొండ

ఉద్యోగాల కల్పనే వర్సిటీ లక్ష్యం : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అనురాగ్ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యం అని చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. తమ యూనివర్సిటీలో సదుపాయాల కల్పించేందుకు నిరంతరం కృషిచేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 1,200 మందికి ప్లేస్‌మెంట్స్ కల్పించామన్నారు. కార్యక్రమంలో డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కడ్తాల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో కడ్తాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో గురువారం నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కడ్తాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి అరవింద్, తరుణ్, ఉదయ్, సాయికిరణ్, నాని, శశివర్ధన్ పోటీల్లో పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, పీఈటీ భీముడు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఆరుగురు విద్యార్థులను మేలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ టీంకు ఎంపిక చేసినట్లు చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, శ్వేత, ఇంద్రారెడ్డి, కౌసల్య, భాగ్యలక్ష్మి, శోభారాణి, బుచ్చమ్మ, సునిత, భాగ్యమ్మ, గీతాబాయి, స్రవంతి, శంకర్‌నాయక్, మల్లయ్య, తిరుపతి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రహీమ్‌పాషా, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జేఏసీ నాయకులు

గట్టిప్పలపల్లి జేఏసీ నేతల అరెస్ట్

అసెంబ్లీ ముట్టడికి తరలకుండా నిలువరించిన పోలీసులు

తలకొండపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలని కోరుతూ నాలుగు నెలలుగా రిలే నిరశన దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గురువారం జేఏసీ నాయకులు చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో ఆమనగల్లు, కడ్తాల సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్ఐలు శ్రీకాంత్, వరప్రసాద్, వెంకటేశ్, పోలీసు సిబ్బంది పెద్దఎత్తున గ్రామానికి చేరుకున్నారు. గట్టిప్పలపల్లి నుంచి ఎవరూ హైదరాబాద్‌కు వెళ్లకుండా తెల్లవారుజామునే రాజకీయ నాయకులను, జేఏసీ నేతలు 36 మందిని హౌస్ అరెస్ట్ చేసి అనంతరం తలకొండపల్లి, కడ్తాల, ఆమనగల్లు పోలీసుస్టేషన్లకు తరలించారు. జేఏసీ నాయకులకు మద్దతుగా గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పోలీస్ స్టేషన్లలో ఉన్న జేఏసీ, బీఆర్‌ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ అనురాధ, ఇతర నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాలరాస్తోందని జైపాల్ యాదవ్ మండిపడ్డారు. రిలే నిరశన దీక్షలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం అసెంబ్లీకి వెళ్తారని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అరెస్ట్ అయిన, పరామర్శించిన వారిలో అశోక్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, ఆంజనేయులు, శరత్ చంద్ర, వెంకటయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, అనిల్, శేఖర్, జంగయ్య, రత్నయ్య, లక్ష్మీపతి, యాదగిరి, అనంత రాములు,పవన్, జీవ, అనిల్, పత్యానాయక్, రమేశ్ నాయక్, చెన్నయ్య, హరిచంద్ నాయక్, శానమోని పాండు, బక్కికుమార్, శంకర్, తదితరులు ఉన్నారు.

257 మంది విద్యార్థుల గైర్హాజరు

వికారాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ మ్యాథ్స్-1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 257మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 7,073 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 6,816 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,489 మందికి 151మంది, ఒకేషనల్‌లో 106 మంది గైర్హాజరయ్యారు.

కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): షుగర్(డయాబేటిస్), బీపీ ఉన్న వారు వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తలను పాటిస్తూ కిడ్నీ(మూత్రపిండా)లను కాపాడుకోవాలని డాక్టర్ అనంతరెడ్డి తెలిపారు. గురువారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో ఇంపాక్ట్ గురు ఫౌండేషన్(ఐజీఎఫ్) సంస్థ, దాట్ల ఫౌండేషన్ బీఈ కంపెనీ సహకారంతో వరల్డ్ కిడ్నీడే-2025ను నిర్వహించారు. అవగాహన సదస్సులో స్పెషలిస్టు డాక్టర్ అనంతరెడ్డి మాట్లాడుతూ.. షుగర్, బీపీతో ఉన్న వారు, కుటుంబీకుల్లో కిడ్నీ సమస్యలున్న వారు, అధిక బరువున్న వారు కిడ్నీ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. తరచూ వైద్యులతో కిడ్నీ పరీక్షలను తప్పక చేయించుకోవాలని చెప్పారు. నొప్పి నివారణ మందులను వాడకం, సొంత వైద్యం ప్రమాదకరమని, ఉప్పు వినియోగాన్ని తగించాలని, నీటిని ఎక్కువగా తాగాలని ప్రజలకు అవగాహన కల్పించారు. జాగ్రత్తలు పాటించకుంటే, నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలు చెడిపోతాయని, ప్రాణాలకు హాని అని వివరించారు. బీపీ, షుగర్ ఉన్న వారు ఆరు నెలలకోసారి తప్పనిసరిగా కిడ్నీల పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనల మేరకు నడుచుకోవాలని అనంతరెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఐజీఎఫ్ సంస్థ, దాట్ల ఫౌండేషన్, బీఈ కంపెనీ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కిడ్నీ రోగుల మధ్య కేక్‌కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆహార అలవాట్లు, వివిధ రకాల కాలుష్యాల వల్ల కిడ్నీ వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతోందని, ఇది ఆందోళనకరమన్నారు. కార్యక్రమంలో వైద్యులు, అనురాధ, ప్రసాద్, డయాలసిస్ ఇన్‌చార్జి రాంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనంతరెడ్డి

'రోడ్డు నిర్మాణానికి నిధులివ్వండి'

పరిగి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పొల్కంపల్లి గ్రామం నుంచి కుర్వగడ్డకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం పొల్కంపల్లి గ్రామస్తులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీ నిధుల నుంచి నిధులు ఇస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, భీమయ్య, మల్లేశం, హరీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మర్పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం స్పీకర్‌ను రాజ్యాంగ బద్ధంగా ప్రశ్నించే హక్కు లేదని, సభలో అనుచిత వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు తగదన్నారు. స్పీకర్ పట్ల ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దోమ: స్పీకర్‌పై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని దోమ మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు నరేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బంట్వారం: నిండు శాసనసభలో స్పీకర్ పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చులకన చేసి మాట్లాడటం సరికాదని బంట్వారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోచారం వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగదీశ్వర్ రెడ్డిని శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

బొంరాస్‌పేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ అన్నారు. మండలంలోని వడిచరలో సీఆర్ఆర్ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను గురువారం ప్రారంభించారు.

బషీరాబాద్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో పర్వత్‌పల్లి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాస్పల్లి నర్సిరెడ్డి, పామిడి కాశీరెడ్డి పేర్కొన్నారు. గురువారం గ్రామంలో ఏంఎన్ఆర్‌ఈజీఎస్ కింద రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సీసీ రోడ్డు పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు.

సీఎంపై విమర్శలు తగదు

బొంరాస్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ యూత్ నాయకుడు బాపల్లి సంతోష్ నాయక్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే ఓర్వలేకే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలన్నారు.

'రేషన్' మంజూరులో గందరగోళం

- కొడంగల్‌లో కులకచర్ల వాసుల పేర్లు నమోదు
- ఆందోళనలో లబ్ధిదారులు



కులకచర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కారుల మంజూరులో గందరగోళం నెలకొంది. కులకచర్ల మండలంలోని ఆయా గ్రామాలకు కొత్తగా మంజూరైన రేషన్‌కార్డు లబ్ధిదారుల పేర్లు కొడంగల్ మండలంలోని రేషన్ షాపుల్లో నమోదయ్యాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. మండలానికి కొత్తగా మార్చి నెలకు సంబంధించి 1608 రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో దాదాపు 50శాతం రేషన్‌కార్డులు కొడంగల్ మండలంలోని 4114001, 4114003 రేషన్‌షాపుల్లో కార్డులు నమోదు కావడంతో ముందు ముందు తమకు ఇబ్బందులు తలెత్తుతాయని లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలోని కుసుమ సముద్రం, రాంపూర్, తిరుమలాపూర్ గ్రామాల పరిధిలోని రేషన్ కార్డుల లబ్ధిదారుల పేర్లతో పాటు చాలా గ్రామాల లబ్ధిదారుల పేర్లు కొడంగల్ మండల షాపుల్లో నమోదయ్యాయి. మార్చి నెలకు సంబంధించిన బియ్యం అక్కడి రేషన్‌షాపులకు విడుదలయ్యాయి. రేషన్‌కార్డు లబ్ధిదారులు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ షాపుల్లో బియ్యం పొందే అవకాశం ఉండటంతో ఇక్కడి షాపుల్లో ఈనెల బియ్యం పొందుతున్నారు.

బియ్యం అందక పేదల పస్తులు

ఈనెల పేదలకు రేషన్ బియ్యం పంపిణీలో ఆలస్యమవుతోంది. ప్రతీనెలా 1వ తేదీ నుంచి 15 వరకు బియ్యం పంపిణీ చేస్తుండగా ఈనెల 13వ తేదీ గడుస్తున్నా బియ్యం ఇవ్వడం లేదు. పేదలు రోజు రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్నా బియ్యం రాలేదని డీలర్లు సమాధానం ఇస్తున్నారు. దీంతో రేషన్ బియ్యంతోనే కడుపు నింపుకునే పేదలు పస్తులతో కాలం వెళ్లదీస్తున్నారు. బియ్యం గోదాం నుంచి సరఫరా కాక చాలా గ్రామాల్లో ఇప్పటి వరకు రేషన్ షాపులు తెరుచుకోలేదు. పరిగి గోదాం నుంచి బియ్యం రేషన్‌షాపులకు సరఫరా కాలేదని చెబుతున్నారు. అయితే గోదాముల్లో బియ్యం లేవని, బియ్యం కొరత కారణమని పలువురు పేర్కొంటున్నారు. కులకచర్ల ఉమ్మడి మండలంలో 30 రేషన్‌షాపులు ఉండగా ఇప్పటి వరకు 20 షాపులకు మాత్రమే బియ్యం సరఫరా జరిగింది. దీంతో బియ్యం ఎప్పుడు వస్తాయో తెలియక డీలర్లు ఎప్పుడు ఇస్తారోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

మార్పులు చేయిస్తాం

రేషన్ కార్డు లబ్ధిదారుల పేర్లు కొడంగల్ మండలంలోని షాపుల్లో నమోదైన విషయం వాస్తవమే. డీఎస్‌వోతో మాట్లాడి వచ్చేనెల ఇక్కడి రేషన్ షాపులకు మార్పులు చేయిస్తాం.

- మురళీధర్, తహసీల్దార్, కులకచర్ల

ఘనంగా ముందస్తు హోలీ సంబురాలు


తాండూరు: హోలీ సంబురాల్లో విద్యార్థులు

కొడంగల్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ హోలీని శుక్రవారం నిర్వహించుకునేందుకు రంగం సిద్ధమైంది.కొడంగల్ నియోజకవర్గంలో మార్కెట్‌లో రంగులు, రంగులు చల్లే పరికరాలను దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

పెద్దేముల్: మండలంలో గురువారం కామదహనం కార్యక్రమాలను నిర్వహించారు.

కులకచర్ల: చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలను జరుపుకున్నారు. శుక్రవారం పాఠశాలకు సెలవు ఉండటంతో గురువారం విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబురాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు ప్రాంతంలో మల్‌రెడ్డిపల్లి రోడ్డులోని సాయి మేధ విద్యాలయంలో పండుగ విశిష్టతను కరస్పాండెంట్ పెరుమళ్ల వెంకట్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సజిత పాల్గొన్నారు.

పరిగి: మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో ఒక రోజు ముందు గురువారం విద్యార్థులు హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎం ఉస్మాన్‌అలీ, ఉపాధ్యాయులు నర్సింహులు, రాజులు పాల్గొన్నారు.

పూడూరు: సోమన్‌గుర్తి నం-1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం హోలీ పండుగను నిర్వహించారు. హోలీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం అంగన్‌వాడీ టీచర్ చిన్నారులకు రంగులు వేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: హోలీ వేడుకలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించరాదని ఘట్‌కేసర్ సీఐ పందిరి పరశురాం తెలిపారు. ఆయన గురువారం ఘట్‌కేసర్ పీఎస్‌లో మాట్లాడుతూ రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు హోలీ వేడుకలపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. నేడు శుక్రవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాంసం, మద్యం దుకాణాలు బంద్ చేయాలని ఆదేశాలు జారీచేశారు.

దుద్యాల: ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని దుద్యాల ఎస్ఐ యాదగిరి అన్నారు. శుక్రవారం హోలీ పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.


పెద్దేముల్: హోలీ సంబురాల్లో యువకులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దోమ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. మండలంలోని మోత్కూర్ గ్రామానికి చెందిన సాయికుమార్, ధన్‌రాజ్ (18) ఇద్దరు స్వగ్రామం నుంచి బుధవారం రాత్రి పరిగి పట్టణానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో షైలారం గేటు సమీపంలోకి రాగానే ఖమ్మంనాచారం నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ట్రాలీని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ధన్‌రాజ్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

దోమ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగాలేని ఓ వ్యక్తి పొలంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కిష్టాపూర్‌లో గురువారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాందర్‌పేట్ లక్ష్మయ్య(55)కు కొద్ది సంవత్సరాలుగా మతిస్థిమితం సరిగాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం పొలం దగ్గర ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సు కారును ఢీకొట్టిందని.. డ్రైవర్ సెల్‌ఫోన్ లాక్కెళ్లిన కానిస్టేబుల్

ధారూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ నుంచి తాండూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్పీడ్ బ్రేకర్ వద్ద కారుకు తగిలింది. దీంతో కారు కొంత బాగం రాసుకుపోయింది. కారు యజమాని అయిన ఓ కానిస్టేబుల్ బస్సును వెంబడించి ఆపి బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ లాక్కెళ్లాడు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం తాండూర్ వైపు వెళ్తోంది. అనంతగిరి సమీపంలో జింక బొమ్మ వద్ద రోడ్డు మలుపులో ఉన్న స్పీడ్‌బ్రేకర్‌ను బస్సు దాటుతుండగా కారు, బస్సు ఒక దానికొకటి తగలడంతో కారు స్వల్పంగా రాసుకుపోయింది. దీంతో కారులో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ బస్సును వెంబడించి బస్సు డ్రైవర్ షఫీతో దురుసుగా ప్రవర్తించి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయాడు. దీంతో డ్రైవర్ ధారూరు పోలీస్‌స్టేషన్ ముందు ఆపి పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన తమ పరిధిలో జరుగలేదని, వికారాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగినందున అక్కడ ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించటంతో డ్రైవర్ వికారాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా డ్రైవర్ సెల్‌ఫోన్ లాక్కెళ్లిన కానిస్టేబుల్ మోమిన్‌పేట్ సీఐ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిపోయి దౌర్జన్యంగా బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్‌ను లాక్కుపోవడమేంటని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేలు అందించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

బొంరాస్‌పేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేలు అందించాలని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం తుంకిమెట్లలో నిరసన తెలిపారు. నిరసనలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుండటంతో ఆటోలకు గిరాకీ తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గౌతమ్, శ్రీను, రాజు, మల్లేశం, రవి, నరేశ్, శేఖర్‌గౌడ్, అశోక్, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులోగా ఎల్ఆర్ఎస్‌ను రెగ్యులరైజ్ చేసుకోవాలని తాండూరు ఇన్‌చార్జి డీఎల్‌పీవో రతన్‌సింగ్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం 2020 ఆగస్టు 26వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో మండలాలకు సంబంధించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తాండూరు నుంచి 2,747, యాలాల నుంచి 3,895, బషీరాబాద్ నుంచి 319, పెద్దేముల్ 1497 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వెంచర్ యజమానులు ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.10వేలు చెల్లించిన వారు మిగతా ప్లాట్లకు కూడా రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.వెయ్యి చెల్లించిన వారు వారి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకున్న వారికి ప్రభుత్వం 25శాతం రాయితీ కూడా కల్పించిందని అన్నారు. ప్రభుత్వ నిబంధనాలకు విరుద్ధంగా చేసిన ప్లాట్లను కూడా ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరించవచ్చని అన్నారు.

గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ

కొడంగల్ రూరల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. మండలంలోని రావులపల్లి అంగడిరైచూర్, చిట్లపల్లి, లక్ష్మీంపల్లి, పెద్దనందిగామ, ఆలెడు, చిన్ననందిగామ, సంగాయిపల్లి గ్రామాల్లో 2023- 2024 సంవత్సరంలో ఉపాధిహామీలో జరిగిన పనులను సోషల్ ఆడిట్ బృందాలు నాలుగు రోజులుగా ఆడిట్ నిర్వహించి గురువారం అధికారులు గ్రామసభలో ఆయా పంచాయితీల పరిధిలో నిర్వహించిన ఉపాధి పనులపై కూలీలను అడిగి తెలుసుకున్నారు.

దుద్యాల: ఆలేడ్ గ్రామంలో ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజుల పాటు ఉపాధిహామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీలో ఆయా గ్రామాల్లో చేపట్టిన వివిధ పనుల గురించి ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. రూ.26 లక్షల 570 రూపాయల ఖర్చుతో షెడ్లు, లెవలింగ్ పనులు, నర్సరీ నిర్మాణ పనులు ఇతర పనులు చేపట్టినట్లు ఆడిట్ అధికారి అనిల్ తెలిపారు.కార్యక్రమంలో ఏపీవో రాములు, ఆడిట్ సిబ్బంది శ్రీనివాస్, కార్యదర్శి రమేశ్ రాథోడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజం


పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీడీవో

తాండూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. బదిలీపై వచ్చిన ఎంపీవో, బదిలీపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. అనంతరం ఎంపీవో సుశీల్‌కుమార్ చెంగోల్, కోటబాస్పల్లి, సంకిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, సుజిత్, శ్రావణిలతోపాటు బదిలీపై వెళ్లిన లాలప్ప, రశీద్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేట ఎంఈవోగా కమలాకర్


ఎంఈవో కమలాకర్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : శామీర్‌పేట ఎంఈవోగా కమలాకర్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి వరకు ఎంఈవోగా ఉన్న వసంతకుమారి ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ పొందారు. దాంతో అప్పటి నుంచి ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. అనంతరం శామీర్‌పేట మండలంలోని బొమ్మరాశిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు(హెచ్ఎం) ఆర్. కమలాకర్‌ను అదనపు బాధ్యతగా ఇన్‌చార్జి ఎంఈఓగా నియమిస్తు రాష్ట్ర పాఠశాల డైరెక్టర్, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్‌లు ఉత్తర్వులను జారీ చేశారు. కమలాకర్ బొమ్మరాశిపేట జడ్పీ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎంగా పనిచేస్తూ అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తారని రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

తై బజార్ వేలం వాయిదా

కీసర రూరల్, మార్చి 13 (ఆధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ వేలం వాయిదా వేసినట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. వేలం పాటలో పాల్గొనేందుకు పోటీదారులు ఎవరూ ముందుకు రాకపోవటంతో వాయిదా వేసినట్లు వివరించారు. తిరిగి ఈనెల 19న మున్సిపల్ కార్యాలయంలో తై బజార్ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనేవారు మున్సిపల్ కమిషనర్ పేర రూ.2లక్షల డీడీని తీయాలన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలి

మర్పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్, రాబోయే పదో తరగతి పరీక్ష కేంద్రాల దగ్గర పటిష్ట బందోబస్తు నిర్వహించాలని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

దౌల్తాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో వెంకటస్వామి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరిరెడ్డి, హన్మంతు, రాజు, సాయిలు గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊపందుకున్న 'సర్వే'

(ఐదో పేజీ తరువాయి)

కృష్ణా వరకు 122 కిలోమీటర్ల మేర 15-20 రైల్వే స్టేషన్‌లతో రైల్వేలైన్ కోసం కసరత్తు చేస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ ఏర్పాటుతో కొడంగల్ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. కొడంగల్ మండలంలోని ధర్మాపూర్, టేకుల్‌కోడ్ ప్రాంతాల్లో సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని పలుమార్లు రేవంత్‌రెడ్డి ఇప్పటికే చెప్పిన విషయం తెలిసిందే. ఎంతో కాలంగా ప్రకటనలకే పరిమితమైన రైల్వేలైన్ పనుల సర్వే వేగవంతం చేయడంతో పరిగి, కొడంగల్, మద్దూర్, నారాయణపేట్ ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రైల్వేలైన్ పనులపై ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి ఫోకస్ పెట్టారు.

రైల్వేలైన్ ఏర్పాటుకు రూ.50.818 కోట్లు

గతంలో ఈ రైల్వేలైన్ కోసం పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ పూర్తికి రూ.50.818 కోట్లు అంచనా వ్యయం కాగా అందులో సర్వే పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.2.195 కోట్లను విడుదల చేసింది.

రైల్వేలైన్ ఏర్పాటుతో మేలు

ఎంతో కాలంగా రైల్వేలైన్ ఏర్పాటు కోసం ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపించి త్వరితగతిన పూర్తి చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరగనుంది.

- ఇందనూర్ బషీర్, సీపీఐ జిల్లా నాయకులు

కల నెరవేరనుంది



కొడంగల్ ప్రాంతం అన్ని రంగాల్లో వెనకబాటుకు గురైంది. ప్రస్తుతం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ సర్వే పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజల కల నెరవేరనుంది. రైల్వేలైన్ ఏర్పాటుతో పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

-తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

కొత్త సార్లొచ్చారు!

(ఐదో పేజీ తరువాయి)

విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు కేటాయించిన కొత్త అధ్యాపకుల్లో చాలా వరకు గురువారం తమకు కేటాయించిన కళాశాలల్లో రిపోర్టు చేశారు. గురుకుల కళాశాలల్లో విధులు నిర్వహిస్తూ జేఎల్‌గా ఎంపికైన అధ్యాపకులు అక్కడ తమ విధుల నుంచి రిలీవ్ అయిన తర్వాత తమ కొత్త విధుల్లో చేరనున్నారు.

ఆ మూడు కళాశాలలకు మొండిచెయ్యి

కొత్త కళాశాలలు ఏర్పాటుకు అనుమతించిన ప్రభుత్వం పూర్తి స్థాయిలో పోస్టులు మంజూరు చేయలేదు. ఫలితంగా ఆ కళాశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. కొత్తగా ఏర్పాటైన 4 కళాశాలల్లో హకీంపేట కళాశాలకు ముగ్గురిని కేటాయించగా, మిగిలిన దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, బషీరాబాద్ కళాశాలలకూ ఒకరిని కూడా కేటాయించలేదు. ఈ కళాశాలలకు అవసరమైన పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయలేదు. పోస్టులు మంజూరు చేస్తేనే వచ్చే విద్యా సంవత్సరంలో ఈ కళాశాలల నిర్వహణ సాఫీగా కొనసాగేందుకు అవకాశం ఏర్పడనుంది. పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉంటేనే విద్యార్థులు ఈ కళాశాలల్లో చేరేందుకు ముందుకు రానున్నారు. కాగా, జిల్లాలో ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం పోస్టుల్లో కేవలం నాలుగు పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు సైతం భర్తీ చేయలేదు. చాలా కాలంగా అధ్యాపకుల నియామకం చేపట్టకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా అధ్యాపకుల నియామకంతో జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత కొంత వరకు పరిష్కారం కానుంది. ఆశించిన స్థాయిలో ఖాళీలు భర్తీ కాకపోయినా విద్యార్థులకు కొంత వరకైనా విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు


కొడంగల్ మార్గంలో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపం

తాండూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో వీధి దీపాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిపూర్ రోడ్డులో, కోడంగల్‌రోడ్డు మార్గంలో గురువారం పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. మున్సిపాలిటీలోని ఇంజరీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడంతో కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షిప్తంగా..

బాలుడికి ఆర్థికసాయం

యాలాల: సంగెంఖుర్దు గ్రామానికి చెందిన శివకుమార్, భానుప్రియ దంపతుల కుమారుడు వశిష్ట ఆస్పత్రిలో ఉన్నాడని తెలుసుకుని ఎంపీపీఎస్ పాఠశాల హెచ్ఎం సతీదేవికి, ఉపాధ్యాయులు పరమేష్, జయశ్రీ, స్కావెంజర్ అంజమ్మ కలిసి రూ.2500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

25శాతం రాయితీని వినియోగించుకోవాలి

పరిగి: ఎల్ఆర్ఎస్ 2020 కింద అనుమతులు లేనిలే అవుట్లలో ప్లాట్లు కొన్నవారికి 25 శాతం రాయితీతో రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. ఈ నెల 31లోపు రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి ఎల్ఆర్ఎస్‌లో రాయితీ వర్తిస్తుందని తెలిపారు. పరిగి మునిసిపల్ పరిధిలో 3069 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 96523224858 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు పాంబండ ఆలయంలో రుద్రహోమం

కులకచర్ల: బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు ఉదయం 9 గంటలకు రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

కులకచర్ల: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీవో భాస్కర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని బండవెల్కిచర్లలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం నర్సరీ, కంపోస్టు షెడ్, మురుగు కాల్వల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

మైల్వార్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

బషీరాబాద్: మండలంలోని మైల్వార్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్‌శాఖ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మూడు రోజుల కిందట గ్రామానికి చెందిన సంగోజెట్టి సతీష్ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి ఎస్ఐ పి.శంకర్ సమక్షంలో టెక్నీషియన్‌కు రూ.50వేలు అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆరు కెమెరాలను తీసుకువచ్చి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు.

పెద్దేముల్ డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాసులు

పెద్దేముల్: పెద్దేముల్ డిప్యూటీ తహసీల్దారుగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. పరిగిలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన శ్రీనివాసులు బదిలీపై పెద్దేముల్ మండలానికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అనిల్‌కుమార్ అనారోగ్యరీత్యా లాంగ్‌లీవ్ పెట్టివెళ్లారు. అనిల్‌కుమార్‌ను ఇక్కడి నుండి బదిలీచేస్తూ పరిగిలో పనిచేసిన శ్రీనివాసులును పెద్దేముల్ డిప్యూటీ తహశీల్దారుగా బదిలీ చేశారు.

రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి కవయిత్రి మొల్ల

తాండూరు రూరల్: రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి కవయిత్రి మొల్ల అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్ అన్నారు. అంతారం గ్రామంలో గురువారంకురమ సంఘం ఆధ్వర్యంలో మొల్ల జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

గేటువనంపల్లిగా పేరు మార్చాలి

నవాబుపేట: కొజ్జవనంపల్లి గ్రామాన్ని గేటువనంపల్లి గ్రామంగా పేరు మార్చాలని మాజీ సర్పంచ్ రత్నం గురువారం చేవేళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

పండరిపూర్‌కు దాదాపూర్ గ్రామస్తుల పాదయాత్ర

నవాబుపేట: మండలంలోని దాదాపూర్, లింగంపల్లి, వట్టిమీనంపల్లి, ఏతిరాజ్‌పల్లి, పూడూర్ మండలంలోని పెద్ద ఉమెంతాల్ గ్రామాలకు చెందిన భక్తులు ఈనెల 2న పాదయాత్రగా మహారాష్ట్ర షోలాపూర్ జిల్లా పండరిపూర్‌లో రుక్మిణి పాండురంగ స్వామి దర్శనానికి బయల్దేరివెళ్లారు. గురువారం వారు పండరిపూర్‌కు చేరుకున్నట్లు తెలిపారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: ఈ నెల 16న నాగోల్‌లోని ఎస్‌వీఎం గ్రౌండ్‌లో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్, రాచకొండ కమిషనరేట్ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న మెగా జాబ్‌మేళాను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ పరుశురాం కోరారు.